


# నా కోరికలు అట్టా తీర్చినారు!

‘జామెట్రీ బాక్సులు తేనోళ్లంతా యిళ్లకు పదండీ’ అన్నాడు మాల్యాద్రయివోరు- బ్లాక్‌బోర్డుకాడ చేతిలో చాకీపీసు పట్టుకొని నిలబడతా.

అదీ జామెట్రీ లెక్కల తొలి కిలాసు.

అప్పటికి నాలుగురోజుల కిందే ‘జామెట్రీ లెక్కలు రాబోతా వున్నాయి. తలా ఒక జామెట్రీ బాక్సు తెచ్చుకోవాలి’ అని ఎచ్చరిక జారీ చేసి వున్నాడు మాల్యాద్రయివోరు. ఆయన ఆ మాట చెప్పడమే ఆలిస్యం మా కిలాస్‌లోని క్లవర్లందరి దగ్గరా ‘కేమెలు’, ‘నటరాజా’ జామెట్రీ బాక్సులు ప్రత్యక్షమైపోయినాయి. సగం మంది కొత్తయి కొనుక్కుంటే తక్కినోళ్లు వాళ్ల అన్నయ్యలవో అక్కయ్యలవో తెచ్చుకున్నారు. అట్టా కొనుక్కోకుండా, అయినోళ్లకాడ అరువు తెచ్చుకోకుండా ఉత్తచేతులతో మిగిలినోళ్లం యిద్దరమే యిద్దరం.

ఒకడు: పోలేపల్లి కిషన్ కిషోర్ గాడు. రెండు: నేను.

మేమిద్దరం ఒకరినొకరం యీ సంగతి కనిపెట్టుకొని పక్కనోడి జామెట్రీబాక్సులతో అడ్జస్టయిపోదామని అనుకున్నాముగానీ సైతాన్ మాదర్చోదయిన మాల్యాద్రయివోరు యిట్టా మమ్మల్ని నేరుగా యిళ్లకే పంపించేసే ప్రోగ్రాము పెడతాడని ఊహించలా.

'జామెట్రీ బాక్సు తేనోళ్లు లేస్తారా? లేవరా?' అని మళ్లా అడిగినాడు మాల్యాద్రయివోరు. యింక తప్పదని చెప్పి కిషోరుగాడూ నేనూ లేచినాం.

మాల్యాద్రయివోరు మా తట్టు అట్టా కళ్లు తిప్పి చూసినాడు. ఆయనతో పాటు మా కిలాసులోని మొగపిలకాయలు ఆడపిలకాయలంతా మా తట్టు తిరిగినారు.

'ఏమిరా సాయిబూ... ఎందుకు కొనుక్కోలా?' అన్నాడు మాల్యాద్రయివోరు.

'ఎన్నిమార్లడిగినా మా నాయిన కొనివ్వలేదు సార్' అని, మా నాయిన పరువుని వరవలో కలిపెయ్యడం యిష్టంలాక 'మా నాయిన ఊళ్లో లేడు సార్' అన్నాను.

'ఎందుకు లేడు సార్' అన్నాడు మాల్యాద్రయివోరు.

'కరెంటు సామాన్లు తేవడానికి మద్రాసు పోయినాడు సార్' అన్నాను.

'అయితే మీనాయిన వచ్చేదాకా యింట్లోనే వుండు సార్' అన్నాడాయన.

నాకు బలే బాదగనిపించింది- నన్ను యింటికి పంపిస్తున్నందుకు కాదు... నాతోపాటు కిషోర్గాణ్ణి కూడా పంపించబోతున్నందుకు. ఎందుకంటే అంతకు నెల కిందటే పాపం కిషోర్ వాళ్ల నాయిన ఉన్నట్టుండి చనిపోయినాడు. మేమందరం చిన్నపిలకాయలమే అయినా వాళ్లింటికెళ్లి ఆరోజు చాలా సేపు కిషోర్కాణ్ణే గడిపినాము. అప్పట్నించి మా కిలాసంతా కిషోరు మనసుకు ఎటువంటి కష్టమూ రానీకూడదని అనుకున్నాము. ముఖ్యంగా నేను- ఎందుకంటే వాడంటే నాకిష్టం.

అందుకనే మాల్యాద్రయివోరితో 'సార్... సార్... రేపు తెచ్చుకుంటాము సార్ జామెట్రీ బాక్సు. యియ్యాల్టికి వొదిలెయ్యండి సార్' అని బతిమిలాడినాను.

'కుదరదు సార్. పుస్తకాలు తీసుకొని కదులు సార్' అన్నాడాయన చాక్పీసు అవతల పారేసి బెత్తం అందుకుంటా. ఆయన చేతిలో బెత్తం చూసే సరికి బెదిరి- 'సార్.. మా అమ్మా'... అంటా ఏందో చెప్పబోయినాడు కిషోరుగాడు.

'నిన్ను అడిగినానా? నువు కూచో' అని 'పారా... పా' అన్నాడు మాల్యాద్రయివోరు.

కిషోరుగాణ్ణి కూచోపెట్టినాడు కదా అంతేచాలు అనుకొని గమ్మున పుస్తకాలు తీసుకొని యింటికి కదిలినాను నేను.

యిట్టా యింటికి కదలడం మనకేమీ కొత్తకాదు. దర్మాత్ముడైన మా నాయిన పుణ్యామా అని మూడు నెలలకు ఒక మారన్నా మా ఇస్కూల్లో సగం నుంచి ఇంటికి పంపించేసేవాళ్లు నన్ను. ఎందుకురా అంటే నా ఇస్కూలు ఫీజు నెలకి పదిరూపాయలు. ఆ పది రూపాయల సంబడాన్ని మా నాయిన టయానికి కట్టేవాడు కాదు. కరీం సాయిబు కొడుకు కదా అని

యింకో నెల చూసేవాళ్లు. అప్పటికీ కట్టేవాడు కాదు మా నాయిన. మూడోనెలలో యిట్లా యింటికి పంపించేస్తే మరుసటి రోజుకు ఎట్నో తంటాలు పడి కట్టేవాడు.

నిజ్జానికి మా నాయినలాంటి తాత్సారం నాయిన మా కిలాసులో యింకొకడికి వుంటాడని నేననుకోను. మా నాయిన నన్ను కని విడిచినాడేకానీ ఏనాడూ నా ముక్యమైన కోరికలని పట్టించుకోనే లేదు.

నా ముక్యమైన కోరికలు:

ఒకటి: పుస్తకాలు పెట్టుకునేదానికి మంచి ఇట్టీలు పెట్టె.

రెండు: ఇట్టీలు టిపిను క్యారేజీ- రెండు డబ్బాలది.

మూడు: జామెట్రీ బాక్సు.

యీ మూడు కోరికలు తీర్చడానికి మా నాయినకాడ డబ్బులు లాక కాదు. ఒక్కోరోజు ఆయన జేబులో వంద రూపాయలు కూడా వుంటాయి. అవి వున్న టైములో అడిగినా కూడా 'కొందాము లేరా' అంటా తాత్సారం చేసేవాడేగానీ కొనిచ్చేవాడు కాదు.

తళతళమని మెరిసిపోతా వుండే ఇస్కూలు బాక్సు కొనుక్కొని, దాని నిండుగా పుస్తకాలు సర్దుకొని, లాట్‌గవర్నర్ అమ్మా మొగుడిలా ఇస్కూలుకు వెళ్లాలని నాకెంత కోరికో. తీరనిస్తేగా. 'బాక్సులూ బూక్సులూ ఎందుకులే నాయినా. ఇది చాల్లే' అంటా పుస్తకాలు పెట్టుకునేదానికి గుడ్డ సంచి కుట్టిచ్చిచ్చింది మా అమ్మ.

సరే. అదట్ల పోనీండి. బిడ్డ అడిగినాడే అని ఇట్టీలు క్యారేజీ అయినా కొనీబళ్లా? మా కిలాస్‌లో సగానికి సగం మంది పిలకాయలు నైసుగా అవుపించే రెండు డబ్బాల ఇట్టీలు క్యారేజీలో అన్నం తెచ్చుకుంటా వుంటే మా అమ్మ మాత్రం మోటుగా అవుపించే మూడు డబ్బాల అల్యూమినియం క్యారెజీ తెచ్చిచ్చి 'సర్దుకో నాయినా' అనింది. ఆ అల్యూమినియం క్యారేజీ స్టాండుకి రివిటు లూజు. మాటిమాటికి డబ్బాలు జారి, కింద పడిపోతా వుండేవి. అందుకని రోజూ పత్రుమని పాతగుడ్డ చించి డబ్బాలు జారిపోకుండా స్టాండుకు బిర్రుగా బిగించి కడతా వుండేది మా అమ్మ.

అట్లా ఆ రెండు కోరికలకూ ఆ గతి పట్టించినారు కదా జామెట్రీ బాక్సు కోరికకు ఏ గతి పట్టిస్తారో చూద్దామని యింటికి చేరుకుంటే దారబందరం (గడప) మీదనే కూచొని ఎదురుపడినాడు మా నాయిన.

'ఏమిరో వచ్చేసినావో' అన్నాడు నన్ను చూస్తానే.

'జామెట్రీ బాక్సు తేలేదని మాల్యాద్రయివోరు పంపించేసినాడు' అన్నాను.

'బిడ్డ మూడు రోజుల నుంచి లబలబమని కొట్టుకుంటానే వున్నాడు బాక్సో బాక్సో అని. అదేదో తెచ్చి పెట్టుండొచ్చు కదా నాయినా' అనింది మా నాయినమ్మ- మా నాయినతో.

మా నాయిన ఆ మాటల్ని చెవినేసుకోకుండా 'మన్సూర్‌గాడి దగ్గర లేదా? వాడికి కొనిచ్చినట్టున్నానే' అన్నాడు, పెద్ద కొనిచ్చినోడిలాగా.

'అన్నకెప్పుడు కొనిచ్చినావు? వాడిక్కూడా లేదు జామెట్రీ బాక్సు' అన్నాను విదిలింపుగా.

'అట్టయితే నువు కొనుక్కుందుగానీ ముందిప్పుడు టెంపరరీగా పని జరిగేట్టు చూడు. అనేక తెచ్చుకుందువు' అంటా మహరాజుల్లే బజారుకెళ్లి పోయినాడు మా నాయిన.

నేను ఏడస్తా కూచున్నాను మూల.

'ఏడవబాకరా నాయినా. యిద్దో. యీ రూపాయి తీసకెళ్లి ఇస్కేలన్నా తెచ్చుకోపో' అనింది మా నాయినమ్మ.

'పోరా. తెచ్చుకో. యీలోపల మన వీదిలో యింకెవురి దగ్గరన్నా తక్కిన వస్తువులు దొరకతాయేమో అడిగేసొస్తాను' అనింది మా అమ్మ.

యింకో దారిలాక, ఆ రూపాయితో పొడుగు చెక్క స్కేలు తెచ్చుకునే సరికి మా అమ్మ యాణ్ణించో చిలుము పట్టిన వృత్తలేకినిని తెచ్చిచ్చింది.

'యిద్దోరా. యింకేమి. జల్సా' అనింది దాన్ని నా చేతిలో పెడతా.

'పోరా నాయినా. యింక నీ బాద తీరినట్టే' అని నవ్వింది మా నాయినమ్మ.

మరుసటి రోజు మళ్ళీ లెక్కల పిరీడు వచ్చింది. మాల్యాద్రయివోరు వచ్చి నన్ను చూస్తానే 'ఏమిరా సాయిబూ? తెచ్చుకున్నా?' అనినాడు.

'తెచ్చుకున్నా సార్' అన్నాను దయిర్యంగా.

'వెరీగుడ్' అని బోర్డు వైపు తిరగబోతా, దేనికో అనుమానం వచ్చి 'ఏదీ... చూపీ' అన్నాడు.

వెంటనే లేచి నిలబడి గుప్పిట్లో పొడుగు స్కేలు, వృత్తలేకిని, పెన్సిలు పట్టుకుని చూపించినాను.

మాల్యాద్రయివోరు కళ్ళు పెద్దవి చేసి చూసినాడు వాటివైపు.

'అయి సరే... బాక్సు ఏదిరా?' అన్నాడు.

'బాక్స్ బళ్ళేదుసార్. ఇవి చాలుగదా సార్!' అన్నాను.

ఆ మాటలకు మాల్యాద్రయివోరు నేరుగా కదిలి నాకాడికి వచ్చినాడు.

'ఇవి చాలా?' అన్నాడు, నా చేతిలోని చిలుము పట్టిన వృత్తలేకినిని చూస్తా.

'చాలుగద సార్!' అన్నాను... యీసారి బయం బయంగా, బుగ్గలకు చేతులు అడ్డం పెట్టుకుంటా.

'అయితే కోణమానిని లాకుండా లంబరేఖ ఎట్లా గీస్తావో గియ్యి' అన్నాడు.

నేను బిత్తర చూపులు చూసినాను- కోణమానిని నా దగ్గిరలాక, అది లాకుండా లంబరేక ఎట్లా గీయాలో తెలియక.

అప్పుడు... నాయినా...

చాక్‌పీసు అవతల పారేసి- నా బిత్తర చూపులు తీరేంతదాకా- మాల్యాద్రయివోరు తన్నినాడు చూడూ...

ఒళ్ళు పులిబొంగరం అయిపోయింది సామీ!

★

(యింత వాయింపుడు కార్యక్రమం జరిగినాకైనా నేను జామెట్రీ బాక్సు కొనుక్కున్నాననా? అట్టాంటిదేమీలా. 'కొందాము... కొందాము' అంటానే తాత్సారం చేసిన మా నాయిన పుణ్యమా అని జామెట్రీ బాక్సు లాకుండానే పదోకిలాసేకాదు నా చదువునే గట్టెక్కించేసినాను).

